





# ఆకాశ పందిరిలో నీకు నాకు పెళ్ళంట

– లక్ష్మీ గాయత్రి

CHANDRA

**'మహారాజశ్రీ** వాసుదేవరావుగారికి.

నమస్తే. మీకూ, నాకూ కనీసం ముఖపరిచయం కూడా లేకపోయినప్పటికీ నేను మీకు ఇలా ఉత్తరం రాస్తున్నానంటే దాని వెనుక ఒక బలమైన కారణం వుందని గ్రహించగలరు.

5-1-97 ఆదివారంనాడు మీరు, మీశ్రీమతిగారు కలిసి, మీఅబ్బాయి శ్రీ చంద్రశేఖర్ గారిని తీసుకుని విశాఖపట్నం మురళీనగర్‌లో అంబికాఅపార్ట్‌మెంట్స్‌కి ఎదురుగావున్న ఇంట్లో నివసిస్తున్న శ్రీ వంక చంద్రధరరావుగారి ఏకైక పుత్రిక కుమారి వి. (వంక) వసంతని పెళ్లి చూపులు చూసుకోవటానికి వెళుతున్నారు.

ఆ సందర్భంగా నేను మీకు తెలియజేయ సాహసిస్తున్నదేమంటే 'కుమారి' (కన్య) కాని 'కుమారి వసంత'ని మీ ఇంటి పెద్దకోడలుగా చేసుకోవాలని ప్రయత్నించటం, మీ కుటుంబ సంప్రదాయం దృష్ట్యా అంత శ్రేయస్కరం కాదు!

మనిద్దరికీ కనీసం ముఖపరిచయం కూడా లేనందువల్ల నేను ఇంతకంటే అధికంగా ఏమీ రాయలేకపోతున్నాను. ఈ మాత్రపు నా సాహసానికి మన్నించగలరు!

సంస్కృతి, సాంప్రదాయాలంటే ప్రాణం పెట్టే,

మీ శ్రేయోభిలాషి

కె. ఆకాశరామన్న.'

"ఊఁ, ఇంక అడ్రస్ చెప్పు!"

"రాయి, శ్రీ ఎం. వాసుదేవరావుగారు, డోర్ నంబరు 4-11-35/1, దాసన్నపేట, విజయనగరం."

***

సన్నజాజులు, కనకాంబరాలు, మరువం కలిపి చక్కగా అల్లిన మాల చేత్తో పట్టుకుని గదిలో అడుగుపెట్టిన కామేశ్వరమ్మ, మంచంమీద బోర్లా పడుకునివున్న కూతుర్ని చూస్తూనే గాభరాగా, "ఏవేఁ, ఇంకా జడైనా వేసుకోలేదూ? అప్పుడే ఐదున్నర అయిపోయింది! ఆరుకల్లా మనింట్లో ఉంటామని పెళ్లికొడుకు తండ్రి కచ్చితంగా చెప్పాడు!" అంటూ మంచం దగ్గరగా వచ్చింది.

ఆవిడ మాటలకి మంచంమీద పడుకుని ఉన్న అమ్మాయి అంగుళం కూడా కదల్లేదే!

"వసంతా! లేమ్మా .... నా తల్లివి గదూ!" ఆవిడ పూలదండ పక్కనే ఉన్న టీపాయ్‌మీద పెట్టి కూతుర్ని బలవంతంగా లేవదీసింది.

తల్లి బలవంతాన ఎలాగో లేచి కూర్చున్న వసంత, తల అడ్డంగా తిప్పుతూ - "ఇలా మాటి మాటికీ ఈ నరకం పడటం నా వల్ల కాదమ్మా! విజయనగరం సంబంధం వాళ్లు కూడా వస్తామని ఇంత కచ్చితంగానూ చెప్పి, తీరా ఆఖరిక్షణంలో 'రాలేకపోతున్నాం క్షమించండి!' అంటూ ఫోన్ చేసేశారు. ప్రతి సంబంధంవాళ్లకీ ఆకాశరామన్న ఉత్తరాలంటూ ఏవో అందుతున్నాయని మనకి మధ్యవర్తులద్వారా తెలుస్తూనే ఉంది. విజయనగరం వాళ్లు రామని చెప్పి పట్టుమని పదిహేను రోజులు కూడా కాలేదు. మళ్లీ 'మరో సంబంధం తెచ్చాం, వాళ్ల ముందు కూర్చో!' అంటున్నారు. ఇలా ఎన్నాళ్లమ్మా? ఏ తప్పూ చెయ్యకుండా ఇలాంటి శిక్ష అనుభవించేకంటే పెళ్లిమాటే మర్చిపోయి హాయిగా బతకటం వెయ్యిరెట్లు నయం!" అంది. మంకెన పువ్వుల్లా మారిన వసంత కళ్ల నుంచి నీళ్లు జలజలా రాలాయి.

కూతురి బాధ చూసి తల్లి కూడా కళ్లనీళ్లు పెట్టుకుంటూ, "అలా అనకు, తల్లీ! నీకు ఈ సంబంధం కుదిరితే నడిచి ఏడుకొండలూ ఎక్కి తలనీలాలు సమర్పించుకుంటానని ఆ వెంకటేశ్వరుడికి మొక్కుకున్నాను. ఆ ఏడుకొండలవాడు ఈసారి మనల్ని తప్పకుండా గట్టెక్కిస్తాడు. లే, నా మాట విని చప్పున తయారవు! బంగారు తల్లివి! నిన్ను చేపట్టే అదృష్టం లేక ఇప్పటిదాకా ఇలా అన్ని సంబంధాలూ తప్పిపోయాయి కానీ, ఈ సంబంధం తప్పకుండా కుదురుతుంది చూడు! లే ... ఇదిగో, జడ వేసుకుని ఈ పువ్వులు పెట్టుకో! కళ్లకి కాటుకా, ముఖాన బొట్టూ చక్కగా పెట్టుకో!" అంటూ కూతుర్ని లేవదీసి, పూలదండ చేతికిచ్చింది.

"పువ్వులు పెట్టుకుంటాన్లే కానీ,.కాటుక మాత్రం పెట్టుకోను! మధ్యాహ్నం నుంచి ఏడ్చీ ఏడ్చీ కళ్లు మండిపోతున్నాయి. తల కూడా నొప్పిగా ఉంది!" పువ్వులు తీసుకుంటూ అంది వసంత.

"సరేలే, ఏదో నీకు నచ్చినట్టు తయారవు! వేడిగా ఒక కప్పు కాఫీ తెస్తాను, తాగు! కాస్త సర్దుకుంటుంది!" కామేశ్వరమ్మ టైం చూసుకుని హడావుడి పడుతూ వంటింట్లోకి నడిచింది.

దాదాపు గంట తర్వాత, ముందుగదిలో సోఫాలో బాగా తల వంచుకుని కూర్చుంది వసంత. తల పైకెత్తితే బాగా ఎర్రబడి, ఉబ్బి ఉన్న తనకళ్లు వాళ్లకి అసహ్యంగా కనిపిస్తాయేమో నని తల మొదటినుంచీ బాగా దించుకునే ఉంది.

"మాకు నీ మొహం అసలు కనిపించటంలేదు, తలకాస్త పైకెత్తమ్మా!" అని పెళ్లికొడుకు తల్లి నవ్వుతూ అనేసరికి తప్పనిసరిగా తల కాస్త పైకెత్తి, పెళ్లికొడుకు వైపు ఒక చిన్న ఓరచూపు చూసి, మళ్లీ వెంటనే తల దించేసుకుంది! 'పెళ్లికొడుకు తెల్లగా, పొడుగ్గా బాగానే ఉన్నాడు' అనుకుంది మనసులో.

పెళ్లివారు ప్రసన్నంగానే ఉన్నారు. పెళ్లికొడుకు తండ్రి నవ్వుతూ కొడుకుతో, "ఏరా! ఏమంటావ్?" అంటూ అక్కడికక్కడే అడిగేశాడు.

పెళ్లికొడుకు చిన్నగా నవ్వినట్టున్నాడు. "మీ ఇష్టం, నాన్నా!" అన్న మాట మాత్రం వినిపించి

## 'టీ'తో గుండెజబ్బులకు దూరం!



టీ, కాఫీలు మంచివి కావని డాక్టర్లు చెబుతున్నా, ప్రపంచవ్యాప్తంగా తాగేవారి సంఖ్య పెరుగుతున్నది. హైదరాబాదులోని ఇరానీ టీ స్టాల్స్, మద్రాసులోని నాయర్ టీ స్టాల్స్, ఆంధ్రప్రదేశ్‌లోని ధమ్ టీకొట్టు బాగా ప్రచారం పొందాయి. స్టార్ హోటల్స్‌లో రు.20లు పెట్టి 'వేడి తేనీరు' తాగినా రు. 2ల ధమ్ టీ రుచి రాదు. చాక్లెట్, బాదం, బ్లాక్ టీ, లెమన్ టీ, మలయ్ చాయ్ మొదలైన రకాలున్నాయి.

మనదేశం ఏటా రెండువేల కోట్ల రూపాయల విలువైన(1996లో వంద కోట్ల కిలోల తేయాకు ఉత్పత్తికాగా, అందులో 75 కోట్ల కిలోలు) తేయాకును ఎగుమతి చేస్తున్నది.

సెగలు, పొగలు కక్కుతూ మంచి వాసనతో ఉన్న టీని సేవిస్తే ఎవరికైనా హుషారు వస్తుంది. టీ బాగుందో, లేదో దాని రంగు రుచి వాసన చూడటానికి ప్రత్యేక నిపుణులున్నారు.

పరిమితంగా -అంటే రోజూ నాలుగయిదు కప్పుల టీ తాగేవారు కాన్సర్, గుండెజబ్బులకు లోనుకారని వైద్యశాస్త్రవేత్తలు పరిశోధనలద్వారా నిరూపించారు. రెండుగంటల పని అయిన తర్వాత టీ బ్రేక్ ఇస్తే తిరిగి ఆ ఉద్యోగి మరింత హుషారుగా పనిచేస్తాడు.

మన దేశంలో తయారైన టీ అమెరికా, బ్రిటన్, రష్యా, శ్రీలంక, జపాన్, యూరప్ దేశాలకు ఎగుమతి అవుతున్నది. ఈ పరిశ్రమపై యాభైవేలమంది కార్మికులు జీవిస్తున్నారు.

భారతదేశంలో రోజూ 50 కోట్ల కప్పుల టీ విక్రయింపబడుతున్నది. టీ తాగేవారి సంఖ్య ఏటా పది శాతం పెరుగుతోంది.

- కృష్ణాజీ

**వంట**

జడ్జి: నిన్ననే పెళ్లి చేసుకుని ఇవాళ విడాకులు కావాలని ఎందుకు కోరుకుంటున్నారు?

కమల : నిన్న రాత్రి ఆయన నా మనసును గాయపరిచే మాట అన్నాడు.

జడ్జి: ఏమిటో అది?

కమల: నాకు వంట చేయడం రాదని.....

**పి.వి. మురళీకృష్ణ**

ఇష్టం, నాన్నా!" అన్న మాట మాత్రం వినిపించి వసంత గుండె ఒక్కసారి ఝల్లుమంది.

అప్రయత్నంగా తలెత్తి తల్లివైపూ, తండ్రివేపూ చూసింది. ఇద్దరి ముఖాలూ పుచ్చపువ్వుల్లా ఉన్నాయి.

ఇంతలో పెళ్లికొడుకు కూర్చున్న సోఫాపక్కనే చిన్నస్టూలు మీదున్న ఎర్రరంగు ఫోను మోగింది.

"ఒక్కక్షణం!" వసంత తండ్రి అంతరాయానికి క్షమార్పణలు చెబుతూ వెళ్లి ఫోను తీశాడు.

"హలో! 553873యేనాండీ!"

"అవునండీ! ఎవరు కావాలి మీకు?"

"అక్కడ రామచంద్రరావుగారున్నారు కదా! ఆయన్ని ఒక్కక్షణం ఫోను దగ్గరకి పిలుస్తారా!"

"రామచంద్రరావుగారా ...?" అప్రయత్నంగా పైకే అనేసిన వసంతతండ్రి ఏదో సందేహిస్తూ ఒక్క క్షణం ఆగాడు.

"ఏమిటండీ ... నాకా ఫోను ...?" పెళ్లికూతురు తండ్రి నోటివెంట తన పేరు వినగానే పెళ్లికొడుకు తండ్రి సోఫాలోంచి లేచి ఫోను దగ్గరగా వస్తూ అడిగాడు.

"ఆఁ, ఎవరో మిమ్మల్నే అడుగుతున్నారు!" విధిలేక రిసీవరు పెళ్లికొడుకుతండ్రి చేతిలో పెట్టి పక్కకి తప్పుకున్నాడు వసంత తండ్రి.

పెళ్లికొడుకు సోఫాలో జరిగి, తండ్రికి చోటిచ్చాడు.

రామచంద్రారావు కొడుకు పక్కన కూర్చుంటూ, రిసీవర్ చెవిదగ్గర పెట్టుకుని, "హలో! నేనే రామచంద్రరావుని!" అన్నాడు.

ఫోను మోగిన క్షణం నుంచి టెన్షన్ అనుభవిస్తున్న వసంత, సిగ్గు మాటే మర్చిపోయి, తలెత్తి ఫోనులో మాట్లాడుతున్న పెళ్లికొడుకు తండ్రివైపే చూడసాగింది.

"రామచంద్రరావుగారూ! నమస్తే! నేనెవరో మీకు తెలియదులెండి! అట్టే మాట్లాడి మీ సమయాన్ని వృథా చెయ్యను! మీరు మీ అబ్బాయికి వసంతని చేసుకోవాలని నిశ్చయించు కున్నారా?"

రామచంద్రరావుకి ఒక్క క్షణం ఏమని జవాబివ్వాలో తోచలేదు.

క్షణంలో సర్దుకుని, "మీకెందుకా విషయం?" అని ప్రశ్నించాడు.

అవతలినుంచి చిన్న నవ్వు వినిపించింది. "బాగా అడిగారు! ఎంతైనా క్రిమినల్ లాయర్ కదా! నిజమే. మీరు నిశ్చయించుకున్నారా, లేదా అన్న విషయం నాకెందుకు? కాకపోతే, నా ధర్మంగా నేను మీకొక చిన్న సలహా ఇవ్వదలచి ఈ ఫోను చేశాను. మీరు కేసుల్ని అట్టే నాన్చ కుండా తొందరగా తెమిల్చే గొప్పలాయరుగా సిటీలో పేరుబడ్డారు! ఈ సంబంధం విషయంలో కూడా అంత చురుకుగానూ వ్యవహరిస్తే మాత్రం అది కేవలం మీ తొందరపాటుతనమే అయి, మీ అబ్బాయి జీవితమే ఒక క్రిమినల్ కేసు అయితీరుతుంది! తప్పదు! ఉంటాను, నమస్కారం!" ఫోను పెట్టేసిన చప్పుడు.

రామచంద్రరావు సాలోచనగా రిసీవర్ పెట్టేశాడు. ఇటు తిరిగేసరికి, ఉబ్బి, ఎర్రగా ఉన్న కళ్లతో సూటిగా చూస్తున్న పెళ్లికూతురు కనబడి, మనసులో పడిన సందేహం అనుమానమై మొలకెత్తటం ప్రారంభించింది. ఆయన ఒక్కక్షణం ఆలోచించాడు. నిజానికి ఇందులో ఏమీ లేకపోవచ్చు. ఇదంతా ఎవరో కక్షగట్టి చేస్తున్న పని కావచ్చు! కానీ ఇది మామూలు విషయం కాదు. కన్న కొడుకు కలకాలం కలిసి కాపురం చెయ్యాల్సిన విషయం. సందేహాలూ, అనుమానాలతో మొదలుపెట్టి క్రిమినల్ కేసులా విచారించదగ్గది కాదు. సందేహాలకీ, అనుమానాలకీ చోటే ఉండకూడని విషయం.

రామచంద్రరావు క్షణంలో ఒక నిశ్చయానికి వచ్చి, భార్య వైపూ, కొడుకువైపూ చూస్తూ లేవమన్నట్టు కళ్లతోనే సైగచేశాడు.

తర్వాత చక్రధరరావువైపు తిరిగి చేతులుజోడిస్తూ, "మేం ఇంక సెలవు తీసుకుంటాం!" అన్నాడు.

ప్రేక్షకులు ముగ్గురికీ విషయం అర్థమై ముఖాలు కళతప్పాయి. పెళ్లికూతురు వసంత తల మళ్లీ భూమిలోకి వంగిపోయింది.

వసంత తండ్రి మాత్రం చిగురంత ఆశతో పెళ్లికొడుకు తండ్రి వెనక నడుస్తూ, "నన్ను రేపు మీ ఇంటికి రమ్మంటారా?" అంటూ ప్రశ్నించాడు వినయంగా.

"నేను మళ్లీ ఫోన్ చేస్తాను." రామచంద్రరావు భార్య బిడ్డలతో సాగిపోయాడు.

నిస్పృహాయంగా వెనక్కి వచ్చిన చక్రధరరావు సోఫాలో నిశ్చలంగా కూర్చుని ఉన్న కూతురి మొహంలోని విషాద, గాంభీర్యాన్ని చూసి నిలువునా నీరైపోయాడు.

కూతుర్ని ఎలా పలకరించి సంబాళించాలా అని అతడు ఇంకా ఆలోచిస్తూ ఉండగానే వసంత నోరు విప్పింది - "నాన్నా! ఈ క్షణం నుంచి నా పెళ్లి ప్రయత్నాలు మానేస్తారా, లేకపోతే ఈ రాత్రికే నన్ను ఎలాగోలా ఆత్మహత్య చేసుకుని చచ్చిపొమ్మన్నారా?"

కూతురి మాటలకి కామేశ్వరమ్మ గొల్లుమంది. చక్రధరరావు వచ్చి కూతురి పక్కన కూర్చుంటూ ఏదో నచ్చచెప్పబోయాడు.

వసంత తండ్రిని మాట్లాడనివ్వలేదు. ఆవేశంగా -

"వద్దు, నాన్నా! మీరూ, అమ్మా ఇంకేం చెప్పొద్దు. ఈ సంబంధంతో కలుపుకుని ఇప్పటికి అక్షరాలా ఆరుసంబంధాలు వరసగా ఆ ఆకాశరామన్న వల్ల తప్పిపోయాయి! ఆ ఆకాశ రామన్న ఎవడో నన్ను ఈ జన్మకి పెళ్లిచేసుకోనివ్వడు. ఆ సంగతి తెలిసీతెలిసీ ఎందుకు నన్నిలా బాధపెడతారు? నాఖర్మానికి నన్నిలా వదిలెయ్యండి! మీకసలు కూతురేపుట్టలేదనుకోండి!" అంది.

కూతురి మాటలకి తల్లి ఏడుపుస్థాయి పెరిగింది. చక్రధరరావు కోపంగా భార్యని కసురు తూ - "ఆ వెధవ ఏడుపు ఆపవే! బాధపడుతున్న వాళ్ల ఎదురుగా కూర్చుని భోరున ఏడుస్తుంటే వాళ్లు ఆ క్షణానికే ఛస్తారు! అసలు దీనికంతటికీ కారణం నువ్వు! పచ్చగా నట్టింట్లో కాలు పెట్టిన కోడల్ని అడుగుపెట్టిన క్షణంనుంచీ ఆరళ్లు పెట్టి కాల్చుకుతిన్నావు! ఎంతసేపూ డబ్బో డబ్బో డబ్బో అంటూ మీవాళ్లేం పెట్టారు? మీది దరిద్రపు కుటుంబం అని ఆ పిల్లని నానా మాటలూ అని చివరికి పుట్టింటికి పంపించేసేదాకా నిద్రపోలేదు! నీ కూతురి కోసం నువ్వు ఏడుస్తున్నట్టే ఆ పిల్లకోసం ఆ పిల్లతల్లి కూడా ఏడ్చి ఉంటుంది. ఆ తల్లి కడుపుకోత మనకి ఉసురై ఏడిపిస్తోంది. చేసుకున్నవాళ్లకి చేసుకున్నంత మహదేవా! అనుభవించు!" అన్నాడు.

భర్తమాటలు వినగానే కామేశ్వరమ్మ ఏడుపు

టక్కుమని స్విచ్ఆఫ్‌చేసినట్టు ఆగిపోయింది. మరుక్షణం భర్తవైపు కొరకొరా చూస్తూ, "అవునవును! అక్కడికి లోకంలో ఆడాళ్లంతా, వాళ్ల కోడళ్లని నెత్తిమీద పెట్టుకు చూస్తూంటేనే వాళ్ల కూతుళ్లకి పెళ్లిళ్లవుతున్నాయి! లేకపోతే ఇలాగే అఘోరిస్తున్నారు. ఇదిగో, ఇలాంటి చచ్చు కబుర్లు నాకు చెప్పకండి! అసలు మీ మాటలు వింటుంటే నా కింకో అనుమానం వస్తోంది! ఇన్నాళ్లబట్టీ ఆ ఆకాశరామన్న ఎవడా అని బుర్ర బద్దలు గొట్టుకుచచ్చాం గానీ మనకి ఆ ఆలోచనే రాలేదు! చెల్లెల్ని పుట్టింటికి తోలేశామని దాని అన్నే ఈ వెధవపని చేస్తున్నాడో ఏమో? ఒక్కసారి అలా వెళ్లి పోలీసు రిపోర్టిచ్చామంటే కటకటాల వెనకపడి ఏడుస్తాడు వెధవ!" అంది.

"ఆఁ, ఏడుస్తాడు ఏడుస్తాడు! ఏడ్చేది వాడు కాదే వెర్రిమొహమా! మనం! వాడంత తెలివిలేని వాజమ్మ అనుకోకు. డెబ్బైఐదువేల కాషూ, ఐదుతులాల బంగారమూ, ఏభైతులాల వెండీ, ఇంటెడుసారె, సామానూ ఇచ్చి పిల్లనిచ్చామండీ! ఇవేమీ ఆ అత్తగారి కంటికి ఆనలే దండీ! కాళ్లపారాణి తడికూడా ఆరకుండానే పిల్లని నానామాటలూ అనటం మొదలుపెట్టి, చివరికి చెయ్యికూడా చేసుకుని పుట్టింటికి కట్టుబట్టల్తో తగిలేసిందదండీ! మా బావ ఉత్త గంగి గోవులాంటి వాడండీ! అతన్ని వాళ్లమ్మే గంగిరెద్దుని చేసి ఆడిస్తోందదండీ అని సాక్ష్యాధారాలతో సహా కళ్లకి కట్టినట్టు కోర్టులో చెప్పగలడు వాడు! వాడెవరనుకుంటున్నావే? సిటీలో అతి చిన్న వయసులోనే పెద్దపేరు తెచ్చుకున్న లాయరు! ముక్కూమొహం తెలీని వాళ్లకి న్యాయం చెయ్యటంకోసం పట్టా పుచ్చుకున్న పెద్దమనిషి. స్వయానా తోడబుట్టిన చెల్లెలు, తండ్రిలేని పిల్ల - ఆ పిల్లకి అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకుంటాడా?! అసలా కుర్రాడు మనల్ని ఇంకా కోర్టుకీడ్చకుండా ఊరుకున్నాడంటేనే గొప్ప! ఇదిగో, ఇన్నాళ్లూ నీకు చెప్పకుండా దాచాం కానీ, ఇప్పుడు చెబుతున్నా విను! నువ్వు అనుమానాలేమీ పెట్టుకోనక్కర్లేదు! నిక్షేపరాయళ్లా లక్షణంగా మన కోడలుపిల్ల అన్న జయప్రకాషే ఆకాశరామన్న! ఆ సంగతి మాకు విజయనగరం సంబంధం చెడగొట్టిన తర్వాత తనే స్వయంగా కలుసుకుని మరీ చెప్పాడు! మా కంటే మాకు కాదులే, వసంత ఒక్కర్తినీ కలుసుకుని చెప్పాడు! చెప్పవే అమ్మా! ఆ మహానుభావుడు నీతో ఏం చెప్పాడో నువ్వే స్వయంగా మీ మాతృదేవతకి వివరించు!"

గుక్కతిప్పుకోకుండా మాట్లాడుతున్న భర్తమాటలకి స్తంభించిపోయిన కామేశ్వరమ్మ అప్రయత్నంగా కూతురివైపు తిరిగింది.

వసంత తల వంచుకుంటూ, "అన్నయ్యకి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ చేయించి, అక్కడ వదినచేత కాపురం పెట్టించాలిట! నువ్వు పొరబాటున కూడా హైదరాబాదు వైపు కన్నెత్తి చూడకూడదట! మరో నెల్లాళ్లలో ఆ పని చెయ్యాలిట! ఈ లోపున నాకేవైనా సంబంధాలు చూస్తే ఇలాగే చెడగొడుతూ ఉంటాడట! నెల్లాళ్లు దాటాకకూడా మనం తను చెప్పిన పని చెయ్యకపోతే ..." వసంత ఆగిపోయింది.

"ఆఁ, చెయ్యకపోతే ...?" ఆత్రుతతో గుండె ఆగిపోయింది కామేశ్వరమ్మకి.

వసంత తల ఇంకా దించుకుంటూ, "చెయ్యకపోతే ... నాకు పెళ్లైతే కాదుట కానీ, తల్లిని మాత్రం అవుతానుట!" అంది.

"ఓరి దౌర్భాగ్యుడా ...!" కామేశ్వరమ్మ గుండెలు బాదుకుంది.


"ఒకవేళ మనం తను చెప్పినట్టు చేస్తే కానీ కట్నం లేకుండా నన్ను పెళ్లి చేసుకుని పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాడుట!" వసంత పూర్తిచేసింది.

"ఛస్తే ఇవ్వను! ఇంత జరిగాక ఆ వెధవకి కాళ్లు కడిగి కన్యాదానం చేసేకంటే అసలు నా కూతురు ఆడదే కాదనుకుని పెళ్లిమాటే మర్చిపోతాను!" వీరావేశంతో ఊగిపోయింది కామేశ్వరమ్మ.

"నువ్వలా చెయ్యగలవేమో కానీ, నేను మాత్రం చెయ్యలేను! అంతకంటే శాంతినివాసంలో నాగయ్యలా నీకు నాలుగు తగలనిచ్చి వసంతని జయప్రకాష్‌కిచ్చి పెళ్లిచెయ్యటం నాకు సులువైన పని!" సుఖంగా సోఫాలో వెనక్కి వాలుతూ అన్నాడు చక్రధరరావు.

శాంతినివాసంలో నాగయ్య చేతికర్ర దెబ్బలు తింటున్నప్పటి సూర్యకాంతంలాగే చూసింది కామేశ్వరమ్మ. తర్వాత కూతురి వైపు చూసి, "ఏవేఁ, నువ్వూ మీ నాన్న పార్టీయేనా?" అని ప్రశ్నించింది.

వసంత మృదువుగా, "అమ్మా! నాన్న, అన్నయ్య ఇద్దరూ నెమ్మదస్తులు. మంచివాళ్లు! వాళ్ల మంచితనాన్ని మెతకతనంగా జమకట్టి ఇన్నాళ్లనుంచీ వాళ్లని గంగిరెద్దుల్లాగే ఆడించావు! నీ ధర్మమా అని ముసలికాలంలో కొడుకు దగ్గర రోజులు వెళ్లబుచ్చుదామనుకున్న తాతా, నాయనమ్మా పల్లెటూళ్లో దిక్కులేనిచావు చచ్చారు! అయినా నాన్న పల్లెత్తుమాట అనలేక పోయారు! అన్నయ్య ఏరికోరి చేసుకున్నాడని, ప్రేమగా చూసుకుంటున్నాడని వదిన్ని చూసి బాధపడిపోయి, అభంశుభం ఎరగని ఆ అమాయకురాల్ని నానా మాటలూఅని, కొట్టి, పుట్టింటికి పంపించేశావు! అయినా అన్నయ్య నిన్ను పల్లెత్తుమాట అనలేక, నీలా కర్కోటకంగా ఉండలేక, నెలమొత్తం కేంపులు వేయించుకుని ఇల్లు పట్టకుండా తిరుగుతున్నాడు. నువ్వు చేసిన పనివల్ల ఇటు నా జీవితం నాశనమవుతోంది! నేను నాన్నలా, అన్నయ్యలా ఊరుకునే రకం మనిషిని కానని నీకు తెలుసు! ఇవేళ్టి ఫోన్‌కాల్‌తో ప్రకాష్ తన పట్టుమీదే ఉంటాడని మరీ కచ్చి తంగా తేలిపోయింది. ఇంక నా జీవితాన్న చక్కదిద్దడానికి, తల్లివి, నువ్వు నడుం కట్టకపోతే నేనే స్వయంగా ఆ బాధ్యత తీసుకుంటాను! ప్రకాష్ చాలా మంచివాడు, సర్వసమర్థు డైనవాడు. అతన్ని చేసుకుంటే సుఖంగా జీవిస్తానన్న పరిపూర్ణ విశ్వాసం నాకుంది!" అంది.



వేలెత్తి చూపిస్తూ మాట్లాడేసరికి కామేశ్వరమ్మ ఉక్రోషంతో కళ్లనుంచి జలజలా కన్నీళ్లు కారుస్తూ, 'కానివ్వండి తల్లీ! మీ మాటే కానివ్వండి! ఉన్నది ఒక్కగానొక్కడు. వాణ్ని హైదరాబాదు పంపించేసి పెళ్లాంతో హాయిగా ఉండమనండి! నేను ఛస్తే నాకు తలకొరివి పెట్టడానిక్కూడా వాడూ, వాడి పెళ్లాం రానక్కర్లేదు! ఇంక నువ్వెవణ్ణి కట్టుకుని ఊరేగుతావో, అదీ నీ ఇష్టప్రకారమే చెయ్యి! నన్నింక ఎవ్వరూ ఏమీ అడక్కండి!' అంటూ లేచి వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఒక్క క్షణంపాటు ఆవిడ వెళ్లినవైపే చూస్తూ ఉండిపోయిన తండ్రీ కూతురూ మొహా మొహాలు చూసుకున్నారు. నెమ్మదిగా ఇద్దరి పెదవులమీదా చిరునవ్వు నాట్యం చేసింది! వసంత చిరునవ్వు నవ్వుతూ కుడిచేతి బొటనవేలు పైకెత్తింది!

***

ఆడపడుచు వసంత స్వయంగా వచ్చి, "వదినా! ఇంక నీ సీతమ్మవారి అవతారానికి స్వస్తి! వచ్చే నెల్లో నువ్వూ, మీ ఆయనా చల్ మోహనరంగా అని హైదరాబాదు చెక్కేస్తున్నారు! ఈ మాట చెప్పగానే అన్నయ్య మొహం ఎంతలా వెలిగిందంటే, పాపం నిజంగా జాలేసిందనుకో! ఈవేళ రాత్రికి నీ పతిదేవుడే స్వయంగా విజయం చేస్తున్నాడు!" అంటూ చెప్పేసరికి కళ్యాణి ముందు నమ్మలేదు. తర్వాత వసంత వివరంగా చెప్పిన కథంతావిని నిర్ఘాంతపోతూ, "ఏమిటి, వసూ నువ్వు చెబుతున్నది? నిజంగా మా అన్నయ్య అలా ఆకాశరామన్న ఉత్తరాలు రాసి నీ పెళ్లి చెడగొట్టాడా?" అంటూ విహ్వలంగా ప్రశ్నించింది.

"లేదు, ఆకాశ సీతమ్మలా నేనే రాసుకున్నాను నా పెళ్లివారికి ఉత్తరాలు!"

"వసూ! ప్లీజ్, నిజం చెప్పు! మా అన్నయ్య అంత దారుణంగా ప్రవర్తించాడా?"

కళ్యాణి ప్రశ్నకి చురుగ్గా చూసింది వసంత. "ఇందులో దారుణమేముంది? చేతనైనంత సొమ్మిచ్చి చెల్లెలికి పెళ్లి చేశాడు. ఆ అత్తగారికి అదేమీ కళ్లకి ఆనలేదు. ఆవిడకి కడుపునిండా డబ్బాకలే! పెళ్లై పట్టుమని రెండేళ్లైనా కాకుండా, అత్తగారి చేతిలో నానా బాధలూ పడి, ఆవిడ గెంటేస్తే మొహం వేలాడేసుకుని పుట్టిల్లు చేరిన చెల్లెల్ని చూసి, ప్రేమాభిమానాలు గల ఏ అన్నకి కడుపు మండకుండా ఉంటుంది?"

కళ్యాణి శాంతంగా, "వసంతా! నువ్వు చెబుతున్నదంతా నిజమే కావచ్చు. కాదనను. కానీ తన చెల్లెలికోసం మరో ఆడపిల్లని ఇంత దారుణంగా మా అన్నయ్య ఏడిపించాడంటే నేను నమ్మలేను. ఆ పిల్ల ఇష్టాయిష్టాలు తెలుసుకోకుండా "నిన్ను నేను చేసుకుంటాన్లే!" అని ఉద్దరింపు మాటలు చెప్పే మనిషి కాదు వాడు. నిజం చెప్పు, వాడు ఆకాశరామన్న అయితే, నువ్వు ఆకాశ సీతమ్మవి కావూ?" అంది.

పట్టుబడ్డట్టు చూసింది వసంత. తర్వాత సిగ్గుగా నవ్వుతూ, "మీ అన్న మీద నీకెంత నమ్మకం వదినా!" అంది.

అప్పటికి కళ్యాణి కాస్త రిలీఫ్‌గా నవ్వుతూ, "దొరికావు కదా! ఇంక చెప్పు!" అంది.

వసంత సిగ్గుపడుతూనే, "మీ పెళ్లి అయినప్పటినుంచీ నేనూ, మీ అన్నయ్యా ఒకరినొకరం ఇష్టపడుతూనే ఉన్నాం. నీ కోసం మీ అన్నయ్య మనింటికి వస్తే నేను కాస్త చనువుగా మాట్లాడే సరికే మా అమ్మ నన్ను కేకలేసేది! ఆవిడకి నన్నో గొప్ప ఇంటి కోడల్ని చేయాలని ఆరాటం. మనసున్నవాడే గొప్పవాడని ఆవిడకి తట్టదు. ఏం చెయ్యాలా అని మేం తర్జనభర్జనలు పడుతూండగానే ఆవిడ నిన్ను ఇక్కడికి పంపించేసింది. ఇంక ఒక్కదెబ్బకి రెండుపిట్టల్ని కొట్టేద్దాంలే అని ఈ ప్లాను నేనే మీ అన్నయ్యకి చెప్పాను. పెళ్లి సంబంధం రావటం తరువాయి, వాళ్ల ఎడ్రస్ పట్టుకొచ్చి దగ్గరకూర్చుని మీ అన్నయ్యచేత ఎడంచేత్తో ఉత్తరం రాయించేదాన్ని! ఇంతకీ నన్ను కనిపెట్టావు కానీ, నాకు ఎడ్రసులిచ్చి సాయంచేసి మరో మహానుభావుణ్ని కనుక్కోలేకపోయావు!" అంది.

"ఎవరు?" కళ్యాణి కుతూహలంగా ప్రశ్నించింది.

"ఇంకెవరు, మా నాన్న! స్వయంగా మీ మావఁగారు!" వసంత నవ్వుతూ చెప్పింది.

"మావయ్యగారా ...!" కళ్యాణి ఆశ్చర్యపడింది. మామగారి మంచితనానికి ఆ కోడలి కళ్లు చెమర్చాయి.

అంతలో, అప్పుడే వీధిలోంచి వచ్చిన అన్నగారిని చూసి నవ్వుతూ, ఆడపడుచుతో, "అదిగో, నీ ఆకాశరాముడొచ్చాడు! నేను వెళ్లి కాఫీలు పట్టుకొస్తాగానీ, ఈలోపున మా అన్నయ్య మాత్రం జాగ్రత్త ...!" అంటూ గుసగుసలాడి, వంటింట్లోకి వెళ్లిపోయింది.

మరి కాసేపటికి హాల్లో టేప్‌రికార్డర్‌లోంచి 'ఆకాశ పందిరిలో నీకు నాకూ పెళ్లంట' అంటూ సుశీల గొంతు మధురంగా వినిపించసాగింది.

ఆ పాట తమకోసమే కళ్యాణి పెట్టిందని గ్రహించిన వసంత, జయప్రకాష్ సమక్షంలో నూతనవధువులాగే సిగ్గుపడింది. చక్కటి సంగీతం, మధురమైన ఏకాంతం, మనసైన జవ రాలి సాన్నిధ్యం - ఈ మూడూ కలగలిసి కలిగించే మత్తుని నిరోధించగలగటం జయప్రకాష్ క్కాదు కదా, ఆ బ్రహ్మకి కూడా సాధ్యం కాదు! మత్తెక్కినవాడు తూలుతూ సమీపంలో దొరికి నదాన్ని ఆలంబన చేసుకున్నట్టే, ప్రేమమైకం కమ్మినవాడు తూలుతూ ప్రియురాల్ని ఆలం బనగా చేసుకుంటాడు!

ఇంక ఈ కథ ఇంతే!

■

